పరిస్థితుల వారసులు

అర్ధరాత్రి దాటింది. సిరావాన లాంటి చీకటి జల జలమని రాలుతోంది. దానికి తోడు మంచు కూడా దట్టంగా పట్టింది. వీధి దీపాలు కునుకుతూ మరణ కాంతిని చిమ్ముతున్నాయి. అది మార్కెట్టు ప్రాంతం. అందుచేత, కుళ్ళిపోయిన కూరలు, ఆకులు, ఆ ప్రాంతాన్ని దుర్గంధంలో ముంచెత్తుతున్నాయి. మార్కెట్టుకు కుడివేపుగా ఒక యిరుకైన సందు ఉన్నది. పగలల్లా ఆ వీధి బావురుమంటుంది. రాత్రివేళ ఆ వీధికున్న "రష్" మరి దేనికీ ఉండదు. పగలల్లా "మర్యాదస్తులు"గా చెల్లుబాటవుతున్న చాలామంది, రాత్రి వేళల్లో, ఈ వీధుల్లో దర్శన మిస్తుంటారు. వీళ్ల దృష్టిలో నీతికీ కోటుకూ భేదం లేదు; అవసరమైనప్పుడు ఈ రెంటినీ ధరిస్తారు. కానప్పుడు వొంకెకు తగిలించుతారు. కిటికీలనుండి సన్నని సంగీతము, నవ్వులు, పరిమళాలు, బైటికి ప్రవహిస్తున్నాయి. తలలు వంచుకొని, ముసుగులు కప్పుకుని నడిచే జనం తాలూకు పదధ్వనులు ఎక్కువ దూరం వినిపించటం లేదు. ఆ జనంలో అన్ని మతాలవారు, అన్ని వర్గాలవారూ ఉన్నారు. అక్కడ మత యుద్ధాలు గానీ, వర్గసంఘర్షణలుగానీ ఉండవు.

అటువంటి వీధిలోనుండి ఒక వ్యక్తి ఆ రాత్రివేళ మార్కెట్టు ముందు కొచ్చాడు. అక్కడ నిర్మానుష్యంగా ఉన్నది. మంచు దట్టంగా కురుస్తోంది. చలికి అతని శరీరమంతా బిగుసుకు పోతున్నది. వేడికోసం రెండు అరచేతులూ గబగబా రుద్దుకున్నాడు. ఆ చేతులతో కండ్లను కాపుకున్నాడు. అయినా చలి తగ్గలేదు. దగ్గరగా ఉన్న చెత్త, చెదారం పోగుచేశాడు. అగ్గిపెట్టె తీసి ముట్టించాడు. మంచుకు తడిసిన చెత్త "చుఁయు" మంటూ మూలిగింది. మరొక సారి ప్రయత్నించాడు. కాని లాభం లేదు. అతను మంచును, చెత్తను, తనను తిట్టుకున్నాడు. అయినా చెత్తకు అతనిమీద జాలి కలగలేదు. అది వెలగనని భీష్మించింది. ఇంతలోకే ఎదురు అరుగులమీద ఏదో చప్పుడయింది. అతను కళ్ళు చికిలించి అటువేపు చూశాడు. ఎవరో ఇటువేపే వస్తున్నారు. మొదటి వ్యక్తి నడుము దగ్గిర తడుముకున్నాడు. పిడికత్తి యథాస్థానంలోనే ఉన్నది.

ధైర్యంతో అతని కోసం ఎదురు చూస్తున్నాడు. అతను సమీపించిన తర్వాత ఫకాలుమని నవ్వాడు మొదటివాడు.

"హోరి! నువ్వురా ఎదవా! నిన్ను చూసి కాస్త భయపడ్డాను. ఒక వేళ పోలీసువాడేమోనని చెడ్డ పిరికి పడ్డాను తమ్ముడూ" అన్నాడు మొదటి వాడు రెండవవ్యక్తి నుద్దేశించి.

"పోలీసుగాదు-బ్రహ్మదేవుడు కూడా రాత్రిల్లు ఈ యేపుకి రాడు తెల్సా? ఎవుడి కరమున్నా కాలి వచ్చాడో...ఒక్క దెబ్బకే ఠాం" అన్నాడు. రెండోవాడు "ఠాం" అన్నప్పుడు చిటిక వేసి, ఇద్దరూ నవ్వుకున్నారు. ఇద్దరూ కలిసి మంట చెయ్యటానికి ప్రయత్నించారు. విధిలేక చెత్త లొంగిపోయింది. "చుంయ్" మంటూ, పొగలు చిమ్ముతూ మండసాగింది చెత్త. గాలి ఆడటం లేదు. అందుచేత పొగ అక్కడి కక్కడనే చుట్టివేస్తోంది. ఆ పొగకు వాళ్ళ కళ్ళు మంటలెత్తి మూసుకుపోతున్నాయి. ఇద్దరూ ఊది, మంటను పెద్దది చేశారు. "వ్యాపారం"లోని "లాభం"లాగా మంట పెద్దది కాసాగింది క్రమ క్రమంగా. చీకట్లను ముందుకు నెట్టి, మంట వెలుగు నీరసంగా, తడిసిన రోడ్డుమీద ప్రాకుతోంది. ఎర్రని మంట కాంతికి, వాళ్ళ ముఖాలు భయంకరంగా కనిపించుతున్నాయి. వెలుగు నీడలు అలలు లాగున, వాళ్లమీద కదుల్లాడుతున్నాయి.

"అట్లావున్నా వేం భాయ్? ఇయ్యాల ఎక్కడా గిట్టుబాటు కాలేదా యేందిరా? ముకం యేల్లాడేశావ్?" అన్నాడు రెండవవాడు; మొదటి వ్యక్తిని చూస్తో.

"ఎవురి ముఖం చూశానోగానీ, ఏమీ గిట్టుబాటు లేదు తమ్ముడూ! లేకపోతే మనమిట్టా ఉంటామో ఉండమో నీకు తెలవదంట్రా."

"ఛస్! అట్టా అనబోకు" అన్నాడు రెండవవాడు. "ఆ మాటన్నావంటే నేను చస్తే వొప్పుకోను; యీాలు దొరకటమేందిరా ఎర్రి ఎదవ! నీ కోసమని—ఎవ్వడా తలుపులు తెరుసుకుని నిదర పొయ్యేది? నిదర పొయ్యే ముంగల అన్నీ బద్దరంగా చూస్కొని కునుకేస్తారు. మరి దొంగతనం సెయ్యటమంటే మజాకా అనుకొన్నావట్రా తమ్ముడూ" చెత్తను కాస్త మంటమీద వేస్తూ అన్నాడు.

"ముయ్యరా నోరు-పెంటిముఖం నాయాల. ఒరేయ్! నేను నీకంటే బుర్రగలమనిషి నేరా! మొన్న నిండుబస్సులో, చపక్ మని పర్సుకొట్టేశాను.

మునసీట్లో ఇనిస్పెక్టరు కూసొనివున్నాడు. అక్కడ వుండగానే మన తడాఖా చూపించానురా...కూటయ్యాభై పైచిలుకు గిట్టినాయి. అసుమంటప్పుడు నీబోటి నాయాళ్లైతే, అణ్నే యిరగదొక్కుకు సచ్చేవాడు. అన్ని రోజులూ మనియ్ గావురా తమ్మన్నా! దానికీ అదుష్టం కలిసిరావాల...సర్లే గాని...ఏదీ...ఒక బీడిముక్క యిచ్చుకోమ్మా..."

"ఇయ్యాల నీయింటికి నా యిల్లు ఎదుర్రా... నేనే నిన్నడుగుదామనుకుంటుంటే—"

కొయ్యరా నా బిడ్డా కొయ్! ఒరే...నేను అసలు మాదర్ ఛేద్ లండీకొడుకుని. అవలిస్తే పేగులులెక్క పెట్టేస్తాను...తియ్రా ముందు బీడీ!

"అమ్మతోడన్నయ్యా! ముండమోపి బీడీకోసం నే నబద్ధమాడతానంటరా! నువ్వు గామట్టి- పాతికరూపాయలు రెయిలు టేషన్లో కొట్టేసి, కాఫీకి పావలా డబ్బులడిగితే లేవన్నావుగానీ, నేనే అయితే గిరగిర తిప్పి మొకాన యేసేవాణ్ని తెల్సా?"

"సూరన్న కియ్యాల్సిన పద్ధాలుగు యియ్యాల్టికిగూడా యియ్యలేదుగానీ, యీడేందో గిరగిరా—గిరగిరా తిప్పి మొఖమ్మీద ఏస్తాడంట! ఏందిరా నీ బొంద నువ్వేసేది?"

"ఆ లొట్టముఖం నాయాల నీతో సెప్పాకు నేడిశాడంటారా! ఆడు నాకు నాలుగుపట్లు బాకీ ఉన్నాడు. నాయి నాకిచ్చి ఆడి డబ్బు ఆణ్నే పట్టుకెల్లమను. ఎవుడిక్కావాలి ఆడి ముండమోపి పద్ధాలుగు?"

"అసలు మీ జూదగాళ్ళలోనే ఉందిలేరా ఈ రోగం. ఒకడికి, ఇంకొడికి, పడదు. ఎప్పుడూ బాకీలు మీ...నాతో రారా భాయి, బాగుపడుదువుగాని...ఏందిరా అది? అటు సూడు తమ్ముడూ! ఎవుర్రా ఆ వొచ్చేది?"

మొదటివాడు మార్కెట్టువేపుకు వేలు చూపిస్తూ అన్నాడు. ఇద్దరూ ఆత్రుతగా అటువేపు చూశారు. పావునిముషం లోపుగానే మరొక వ్యక్తితూలుకొంటూ అక్కడికొచ్చాడు.

"ఓరి! నువ్వట్రా ముసిలోడా! రారా ముసిలోడా రా! కాసేపు నువ్వుగూడా సలికాసుకో" అన్నాడు రెండవవాడు.

"అదుగందుకే బాబూ వత్తావుండాను. సలి మరీ కొరక్కతింటావుంది బాబూ! నిదరపట్టలేదు...కడుపులో వొకటేమంట. హారేరాం! హారేరాం"

అంటూ మంటదగ్గరగా జరిగాడు ముసలోడు. రెండు చేతులూ మంటమీద పెట్టి చలి కాపుకొంటున్నాడు.

"ఏవూరుతాతా మంది" అన్నాడు దొంగ.

"మాది శాణాదూరం బాబూ! ఆడ బతకలేక యీదేశ మొచ్చినాను" అన్నాడు ముసలోడు చలికి గజగజ వొణికిపోతూ.

"ఈడ బాగా జరుగుబాటవుతుందా తాతా నీకు?" అన్నాడు దొంగ.

"ఏం సెప్పను బాబూ! పొద్దల్లా 'హారేరాం హారేరాం' అంటూ ఆవ జాన తిరిగితే మాపిటేలకి బొక్కెడు బువ్వ దొరకటం ప్రెలయం; నిన్నా, యియ్యాలా—ఎవురి మొకం సూశానోగానీ బాబూ! 'యిదిగోరా ముసలాడా!' అన్న తల్లేలేదు ఏం సెప్పను బాబూ నా గోడు...అయ్య! బాబులూ!! ముసిలాణ్ణి, వక్కరవ్వ పుగాకుతుంపుంటే పారేయించండి బాబులూ! మీకు పున్నె ముంటాది" అన్నాడు బిచ్చగాడు, ఇద్దరివేపు ముఖం తిప్పుతో. ప్రొద్దున్నుంచీ సిన్నతుంపన్నా యేసుకోలేదు బాబయ్యలూ!"

"నేనూ ఇందాట్నించి బీడీ కాల్చలేదు ముసలయ్యా" అన్నాడు దొంగ. రెండవ వాడివైపు చెయ్యి చూపిస్తూ." వాడిదగ్గరకూడాయిల్లే. ఉంటే యిప్పించేవోణ్ణి"

"పోన్లేబాబూ! రాముడికి దయకలగలేదు ... అయితే—నువ్వేం సేత్తావు నాయనా?" అన్నాడు ముసలాడు, ఆరిపోతున్న మంటను ఊదుతో.

దొంగ—ఒక క్షణం బిచ్చగాడి ముఖంలోకి చూసి తల దించుకున్నాడు. తను దొంగతనం చేస్తానని అతనితో చెప్పటానికి సిగ్గుపడ్డాడు. అతనితో చెప్పినంతమాత్రాన ప్రమాద మేమీలేదని దొంగకు తెలుసు. అయితేనేం? తను చేస్తున్న పని "నీచ" మైనదని! ఏమూలనో అతని అంతరాత్మ హెచ్చరిస్తోంది గావును. దొంగ పలకలేదు. బిచ్చగాని ప్రశ్నకు జూదరి సమాధానమిచ్చాడు.

"నువ్ జేసే పనేలే తాతా? నువ్వేమో—కానీ, దమ్మిడీ, బువ్వ, అడుక్కొంటావు. మా తమ్ముడేమో..." అన్నాడు జూదరి; కిసుక్కున నవ్వుతో "మాతమ్ముడేమో—మరే—రాత్రిళ్లు వొందలు, వే* అడక్కుండా చపాయించేస్తుంటాడు అంతే తాతా!"

"దొంగతనమా బాబూ!" అన్నాడు బిచ్చగాడు. ఆ మాట విన్నతర వాత కొంచెం వెనక్కి జరిగాడు బిచ్చగాడు.

దొంగ ముఖం చిన్నబోయింది. తను 'ఫలానా' అని జూదరి చెప్ప కుండా ఉన్నట్లయితే బాగుండే దనుకున్నాడు. అయినా మించిపోయిం దిప్పుడు. తనేమీ చెయ్యలేడు.

"దొంగతనం పాపం బాబూ! ఆనిక్క నీకేమయినా కోపంరానియ్! ప్రెమాణకంగా సెప్తున్నాను. సచ్చిన తరువాత యమలోకంలో—ఈ పాపకిరమంతా అనబగించాలి" అన్నాడు బిచ్చగాడు. రెండు చేతులూ జోడించి భగవంతునికి నమస్కరించుతూ.

"నువ్వన్నమాట నిజమే 'తాతా!" అన్నాడు జూదరి మరికాస్త చెత్తను మంటమీదికి తోస్తో. "అల్లందరూ సుకంగా నిదరబోతుంటే—పాటుగా—వాళ్ళ కష్టార్జితం కాజెయ్యటం మోసమే తాతా! ఈ ఎదవ నాయాల నేను చెబితే యినిపించుకోటల్లేదు. నువ్వన్నా సెప్పు తాతా!"

ఈ మాటతో దొంగకోపం కట్టలు తెగింది. అసలే అతనికి జూదరిమీద ఇందాకటినుండీ కోపం రేగుతోంది. అవకాశం కోసరం ఎదురుచూస్తున్న అతనికి; జూదరి దొంగతనాన్ని ఎద్దేవాజేయటం ఆసరాగా తీసుకొన్నాడు.

"ఒరి! నోరుముయ్యరా ముండమోపి! మోసం ఉందల్లా—ఆ మాట కొస్తే జూదంలోనే ఉంది." అన్నాడు దొంగ బిచ్చగాడివైపు తిరిగి. "జూద మాట్టం మోసంగాదా తాతా?"

"మోసమే బాబయ్యా మోసమే" అన్నాడు బిచ్చగాడు; కాదంటే ఏమి కొంప మునుగుతుందోనని.

"కాదు" అన్నాడు జూదరి బిగ్గరగా. "రాజాగా ఆడతాం, అదృష్ట ముంటే గెలుస్తాం. లేకపోతే వోడిపోతాం. ఇందులో ఎవడికళ్ళూ కప్పటం లేదు. మరైతే ఇదెట్టా మోసమవుద్ది?"

"అసలియ్యన్నీ తప్పే బాబులూ! కష్టపడి పనిసేసుకోవాల. దానికి సాటి యీ ప్రెపంచకంలోనే లేదు" అన్నాడు బిచ్చగాడు.

"కష్టపడి నువ్వేం యెనకేశావుతాతా?" అన్నాడు జూదరి, బిచ్చగాడి వాదాన్ని సుతరామూ ఒప్పుకోక. "కష్టపడేవాడికి—నిజంగా యివిరోజులు గావు. ఆమాటకొస్తే—జూదమాడటం మాత్తరం కష్టంగాదా తాతా! ఏం మాట్లాడవేం? కష్టంగాదూ?"

“హాయిగా—నీడపట్టున కూకోని ఆడటం కష్టమా? కష్టమంటే నాదే చెప్పుకోవాలి. ఎన్ని గొడవలు! ఎన్ని బాదలు!! గోడలు దూకాలి. కన్నా లెయ్యాలి. ఇంటో ఎవురూ లేవకుండా చూడాలి. ఇంకే ఎదవనాయాలన్నా కనిపెడుతుండాడేమో గ్రయించుతుండాలి. ఇంతా చేస్తే—ఒక్కోడి కొంపలో ఎండిపల్లెమైనా ఉండదు. పైకిమాత్రం యమడాబుగా ఉంటారు. నా కష్టంముందు - నీ దేపాటి కష్టం? ఏం తాతా నువ్ జెప్పు?” అన్నాడు దొంగ, తాత భుజాన్ని పట్టుకొని కడుపుతో. బిచ్చగాడు బిత్తరపొయ్యాడు ఆ వూపుకు. తను ఏదో ఒకటి చెప్పాలి. చెప్పకుండా ఊరుకోవడానికి వీల్లేదు. ఎటుచెప్పటం? బిచ్చగాడు ఈ తికమకతో గుంజులాడుతున్నాడు. అదృష్టవశాత్తు అంతలోకే, కాళ్ళీడ్చుకొంటూ వొకస్త్రీ ఆ మంటదగ్గర కొచ్చింది. ముఖం కొంచెం అణగినట్లున్న దాస్త్రీకి. తెల్లటిచీర కట్టుకొన్నది. తల్లో ఏవోపూలు ప్రక్కకు జారాయి. బిచ్చగాడు ఆస్త్రీనిచూచి కాండ్రించి ఊశాడు.

“ఇక్కడికికూడా నువ్వొచ్చావే గుడిసేటిదానా! నీముఖం చూస్తే పంచమహాపాతకాలు తగుల్తాయి. హరేరామ, హరేరామ” అన్నాడు బిచ్చగాడు మంటకు మరికొంచెం దగ్గరగా జరిగి.

“ఏందే యియ్యాల యిటొచ్చావ్? ఈపూట బేరంతగల్లా?”అన్నాడు జూదరి.

“లేదు బావా!” అన్నది స్త్రీ అతని వీపుదగ్గరకొచ్చి. “ఇప్పుడుదాకా చూసిచూసి వొస్తున్నా”

“సిగ్గూ శరమూ లేదంటే నీకు?“ అన్నాడు బిచ్చగాడు. స్త్రీవేపు అసహ్యంగా చూస్తూ “పో ముందు ఇక్కణ్నుంచి, ఊఁ పోవేం?” అన్నాడు చేతికర్ర పైకెత్తి.

“ఈ ముసలాణ్ని ఇక్కడ కెందుకు రానిచ్చావు బావా! వీడిపెళ్ళాం వీణ్ణొదిలి మరోడితో లేచిపోయింది. అప్పట్నుంచి వీడికి ఆడదంటేనే కోపం!...సరేగాని...పెద్దబావా! ఒకరూపాయ ఉంటే అప్పివ్వు. సాటు కడదాం” అన్నది స్త్రీ.

దొంగ ఫకాలున నవ్వాడు. నవ్వి—“నీ కెంతమంది బావలే పిల్లా?” అన్నాడు. “ఇట్టా కనపడ్డోడికల్లా కక్కుర్తి పడకపోతే ఎవణ్నోవొకణ్ని సేరబట్టుకొని నికరంగా ఉండకపొయ్యావంటే.”

అతనిలోని జెలసీభూతం దుర్బలంగా మూలిగింది అట్టా.

"ఆ సంగతి నేనూ చెప్పాను భాయీ! ఈ తొత్తుకూతురు యినిపిచ్చుకోలేదు" అన్నాడు జూదరి.

"అద్గదీ. నువ్ జెప్పింది శానాబాగుందాబాబూ! అట్టా సేస్తే బగవంతుడుకూడా మెచ్చుతాడు" అన్నాడు బిచ్చగాడు; ఆ స్త్రీ అట్లా బ్రతకడం అతనికిష్టంలేదు. తను రోజూ ఆవిడ చర్యలు చూస్తోనే ఉన్నాడు. ఒక్కోరాత్రికి నలుగురైదుగురు మనుషులు మారటంగూడా తనకు తెలుసు. తన భార్యకూడా తననొదిలివెళ్ళి యిదే వృత్తిలో ఉండేదని విన్నాడు. ఆ కక్షను ఈవిడమీద చూపుతున్నాడు బిచ్చగాడు.

"అసలు మొగోళ్ళంతా గాడిదకొడుకులే! ఆ సూర్యనారాయణ నా దగ్గిరేఉంటే, నేను మరొక మగాడికి వొగ్గేదాన్నే కాను. ఉద్యోగం ఉన్నంతకాలం ఉన్నాడు నాతో. తరవాత చెప్పకుండా పొయ్యాడు. ఇంక నేనేం చేసేది? కడుపులోకి అన్నమెట్టా వచ్చుద్ది? ఆ సంగతిచెప్పు!" అన్నది స్త్రీ తనుగూడా మంటదగ్గర కూచుని.

మంట మెల్లిగా మండుతోంది. ఈ లోపుగా దొంగ మరికొంత తుక్కు, కాగితంముక్కలు, ఎండు అరిటాకు పీలికలు, చెదారము తెచ్చి కుప్పవేశాడు.

"హారేరాం — హారేరాం. మంచి శాస్తిచేశాడు రాముడు నీకు. కావల్సిందేలే నీకు హారేరాం హారేరాం."

"ఈ ముసలాడి సనుగు డేమిటి? పెదబావా" అన్నది స్త్రీ. "వీణ్ని వెళ్ళగొట్టు. ఎప్పుడూ కుక్కలాగా వాగుతుంటాడు...సరేలే గానీ... నువ్వన్నా ఒక రూపాయుంటే యియ్యి...రేపు అన్నానికిలేదు. రెండు రోజుల్లో ఇస్తామళ్ళా. ఏం బావా ?"

"ఈపూట బీడీముక్కకు టికాణాలేదు నా దగ్గిర" అన్నాడు జూదరి.

"మనందరి పనీ ఒకటిగానే ఉంది. చెయ్యరాని పనులు చేస్తున్నాం. అయినా పొట్ట గడవటంల్లేదు. ఛీ ఛీ! అసలు మన బతుకులే పాడుబతుకులు. మన జన్మమే ముదనష్టపుజన్మ" అన్నది స్త్రీ.

"అద్గదీ! సెయ్యరానియి సెయ్యబట్టే రామచంద్రుడు మనకీగతి రాశాడు. ఏ జలమలోనో మనం సేసుకొన్న పాపకరమం యిది. ఇప్పుడనబగిత్తన్నాం —హారేరామ హారేరామ."

మంట పూర్తిగా ఆరిపోయింది. ఎవ్వరూ తిరిగి దాన్ని రగిలించే ఉద్దేశ్యంలో లేరు. మంచు ఇంకా పడుతూనే ఉంది. నలుగురూ, కాళ్ళు ముడుచుకొని, చేతులు మోకాళ్ళమీద బెట్టుకొని మండి ఆరిన కుప్పకేసి చూస్తున్నారు. ఎవ్వరూ పలకటంలేదు. సన్ననిగాలికి, కాలి మసిఅయిన కుప్ప, మెల్లిగా కదులు తున్నది. దూరంగా—పోలీసు బూట్లచప్పుడు 'టకా–టకి' మని వినిపించుతోంది. ఎక్కడో మొరుగుడు, రైలుకూత. వాతావరణం గంభీరంగా ఉన్నది.

ఆ గంభీరతను భంగపరుస్తూ, ఏదో అడుగులచప్పుడు క్రమంగా దగ్గరవసాగింది. నలుగురూ అటుకేసి చూశారు. ఒకవ్యక్తి వాళ్ళవేపే, వస్తున్నాడు. మరికాస్త చెత్తనువేసి దొంగ; మళ్ళా మంటచేశాడు.

"బాబ్బాబు! నీకు పున్నె ముంటాది. కాస్త పుగాకుముక్క— నోట్లోకి యిప్పించు బాబూ! అన్నాడు బిచ్చగాడు కొత్తగావచ్చిన వ్యక్తిని.

దొంగ అతని వాలకాన్ని జాగ్రత్తగా కనిపెడుతున్నాడు. జేబును పరిశీలనగా చూస్తున్నాడు. స్త్రీ అతన్ని –అలవాటు గనక" ఆకర్షించ చూస్తున్నది. అతనుమాత్రం వాళ్ళందరనూ పరిశీలనగా చూస్తున్నాడు. అతని ధోరణికి వాళ్ళు కొంచెం బిడియబడ్డారు. అతనెవరో అధికారేమోనని వాళ్ళ అనుమానం. తప్పకోవటం మంచిదేమో ననుకొంటున్నారు.

ఇంతలో –

"ఎందుకు నా వైపలా చూస్తారు ?" అన్నాడా యువకుడు. "నేనూ మీలాంటి మనిషినే! కొంచెం నాగ్గూడా చోటివ్వండి, చలి కాచుకుంటాను"

"అయితే నువ్వు దొంగతనం చేత్తావా, జూదమాడతావా బాబూ!" అన్నాడు బిచ్చగాడు.

యువకుడు మెల్లగా నవ్వాడు.

నవ్వి—

"నే నలాంటివేమీ చెయ్యను తాతా ! కానీ చేసేవాళ్ళందరూ నాకు స్నేహితులే" అన్నాడు.

"అయితే గుమాస్తాలను బెట్టి సేపించుతుంటావా బాబూ ! హరేరామ, హరేరామ. ఇయ్యాల ఎసుమంటివోళ్ళ పాలబడ్డాను !" అన్నాడు బిచ్చగాడు.

"ఇదుగో ! నామాట వినుతాతా !" అన్నాడు యువకుడు —"దొంగతనం, జూదం, మోసం...నిజంగా తప్పులుగావు. ఈ చేస్తున్న వాళ్ళందరూ,

కావాలని చెయ్యటం లేదు వాళ్ళ స్థితిగతులే వాళ్ళనట్లా తయారుచేశాయి. పరిస్థితులు బాగుపడిన రోజున, చాలా మందికంటే వాళ్లు మంచిగా బ్రతుకుతారు."

ఒక్క బిచ్చగాడు తప్ప, మిగిలిన వారందరు ఒకరి నొకరు చూసుకున్నారు.

"ఏమోగానీ బాబూ!" బిచ్చగాడన్నాడు. "సరీరం పనుసుకు బతికేది మాత్రం—ఇక జనమలో బాగుపడదు" స్త్రీ వేపు చూశాడు.

"పొరపాటు పడుతున్నావు తాతా!" అన్నాడా యువకుడు నవ్వుతూ. "బాగుచేస్తే—ప్రపంచంలో బాగుపడనిదంటూ ఏమీ లేదు. ఈ కిటుకు చాలామందికి తెలీదు. అంతదాకా ఎందుకు? ఇటీవలిదాకా నాకే నమ్మకంలేదు. కానీ ఆలోచిస్తే మొదట నే ననుకొన్నది "తప్పు"అని తేలింది. మా సంఘంలో అటువంటి వాళ్ళను-ఎందర్నో చేర్పించాము. వాళ్లకు తిండీ, గుడ్డా, యిల్లు, ఊరికే యిచ్చాము. చేతిపనులు నేర్పించాము. ఇప్పుడు వాళ్లు చాలా మంచిగా బ్రతుకుతున్నారు. కొందరికి పెళ్ళిళ్ళు చేశాము. చక్కగా కాపరాలు చేసుకుంటున్నారు. అంతదూర మెందుకు? నీ సంగతేమిటో చెప్పు. నువ్వు-ఇక్కడేం చేస్తుంటావు తాతా?"

"బిచ్చ మడుక్కుంటాను బాబయ్యా!" అన్నాడు బిచ్చగాడు.

"నీకు తిండి, గుడ్డ, కొంప, ఉన్నయ్యనుకో. ఇంకా నువ్వు బిచ్చ మెత్తుకుంటావా?"

"ఘూత్... ఈ పాడుపని ఇంకెందుకు సేస్తాను బాబయ్యా?" అన్నాడు బిచ్చగాడు "అయిలేక నేగా బాబయ్యా ఈ తిప్పలు."

"చెయ్యవుగదా! అట్లాగే దొంగలు, వ్యభిచారం చేసేవాళ్ళు, తాగుబోతులు, జూదర్లు...ఒకరేమిటి? ఈ రకాల వాళ్లందరూ ఏవో కొన్ని లోపాలుండే ఈ వృత్తుల్లోకి దిగారు. ఆ లోపాలేమిటో సరిచేస్తే ఇంకా వాళ్లెందుకా పాడుపన్లు చేస్తారు? ఇదిగో! నే నా పనిమీద నే ఈ ఊరొచ్చాను. ఇంకా రెండురోజు లిక్కడ ఉంటాను. నీకు తెలిసినవాళ్ళల్లో ఇటువంటివాళ్లెక్కడన్నా ఉంటే నాకు చెప్పు తాతా! నేను సంఘంలోకి తీసుకుంటాను" అన్నాడా యువకుడు అందరినీ చూస్తూ.

"దొంగలకు పెళ్లాం బిడ్డలుంటే—వాళ్ళకు కూడా పనులు సూపించు తారంటుండీ" అన్నాడు దొంగ.

యువకుడు నవ్వాడు.

"ఆc...వాళ్లకు కూడా ఏదో ఆదరువు చూపెడతాం. మా సంఘం చేస్తున్న పనే అది."

"దీనివల్ల మీకేం లాభం ఉంటుదండీ ?" అన్నాడు జూదరి.

"మాకు వేరే లాభాలక్కర్లేదు. మనిషి-మనిషిగా జీవించటమే మాకు కావలసిందల్లా."

"మీ రెక్కడ ఉంటారో సెప్పండి బాబయ్యా! నేను మీ పాదాల దగ్గర బతుకుతాను. ఇంకా నేను ముష్టి అడుక్కోలేను బాబయ్యా! ఇయ్యాల పొద్దున్నించీ-బొక్కడు బువ్వ తినలేదు బాబయ్యా!" అన్నాడు బిచ్చగాడు యువకునికి నమస్కారం చేస్తూ.

"నా కొక చోటనేదేమీ లేదు తాతా! అవసరమయితే ఈ రాత్రి నీ దగ్గరే ఉండిపోతాను...చూడు తాతా! వీ రెవ్వరు ?" అన్నాడు ప్రక్కవారిని చూస్తూ.

"అత నుపయోగించిన గౌరవ వాచకానికి దొంగ, జూదరు లిద్దరూ రిచ్చపడ్డారు. తమ జీవితాలను అతనితో చెప్పుకున్నారు. తమకీ వృత్తులంటే యిష్టం లే నేలేదన్నారు. యికే గతిలేక చేస్తున్నామన్నారు. ఆ మాత్రం అండ దొరికితే "నీతి"గా బ్రతుకుతామన్నారు. తమ జీవితాల్లోని నీచత్వ మతను ఎత్తి చూపించేసరికి-వారిలో-ఏ మూలనో అణగివున్న మానవత్వం సిగ్గుపడ్డది. తాము చేసిన పనికి పశ్చాత్తాప పడ్డారు. వాళ్ళ కతను అభయ ప్రదానం చేశాడు.

"వీ రెవరు ?" అన్నాడతను స్త్రీ నుద్దేశించి.

"దాందొక ముదనష్టపు బతుకు బాబూ! పెతివోడికి వొళ్లప్పగించి బతుకుతుంటది. సూడండి, ఇరవై దాటలేదింకా, అప్పుడే పీసు పీసు అయింది. దాన్ని కూడా తమ సంగంలో సేర్చుకోండి బాబయ్యా!" అన్నాడు దొంగ.

"పాపం!" అని నిట్టూర్చాడు యువకుడు.

దూరంనుండి మూడు గంటలు, గాలిలో తేలుతూ వినిపించాయి.

"మిమ్మల్ని కలుసుకొన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీబోటి వారంతా పూర్తిగా సహాయపడితేనే కాని, మా సంఘం మంచి స్థితికి రాదు. ఈ సంగతి-ఇంకా-మిగతా వాళ్ళకు కూడా చెప్పండి. చెప్పి వాళ్ళను కూడా మన సంఘంలో చేర్పించండి-పోతే-ఇదిగో! వీరి చరిత్ర యేమిటో కనుక్కోవాలి. అందుచేత నే నీ రాత్రి వీరిదగ్గరుంటాను" అన్నాడు స్త్రీని చూపుతూ యువకుడు. "ఉదయం-మీరు నన్నక్కడ కలుసుకోండి. వెళ్ళిరండి. నమస్కారం."

"చిత్తం-చిత్తం" అన్నారందరూ.

వాళ్ళిద్దరూ బయలుదేరారు.

దోవలో-

"మీ రెక్కడుంటున్నారండీ" అన్నాడా యువకుడు

ఆమె చేతులతో ముఖాన్ని కప్పుకొని వెక్కి వెక్కి పడ్డది.

"ఏడవకండి. ఏడ్చి మీరు సాధించేదేమీ లేదు. గతించినదాన్ని తలుచుకొని మనస్సు చెడగొట్టుకోకండి. న్యాయానికి, నువ్వేమి తప్పుచేశావు? దరిద్రం నిన్నా పనిలోకి నెట్టింది. నువ్వెవరినీ మోసం చెయ్యలేదు. గతిలేక నిన్ను నువ్వు అమ్ముకున్నావు. తప్పులేదు. నీది తప్పని దూషించే వేలాది జనంలో, ఏ వొక్కడు నిన్నాదుకొన్నా-నువ్వీ వృత్తిని చేసి ఉండవు... ఇందులో నీ తప్పేమీ లేదు. నువ్వు విచారించబోకు. పరిష్కారం నేను చెబుతాను" అన్నాడు యువకుడు. "మీ రెక్కడుంటున్నారు?"

"రండి పోదాం" అన్నదావిడ ఏడుపు దిగమింగుకొని.

ఇద్దరూ ప్రక్క వీధిలో పడ్డారు. ఇళ్ళలోనుండి యింకా, నవ్వులు సంగీతాలు, వినిపించుతూనే ఉన్నాయి. కొందరు ముసుగులు కప్పుకొని చరచరా బైటికి వెడుతున్నారు. మరికొందరు వీధుల్లో నిలబడి బేరాలాడుతున్నారు. అంతా నిశ్శబ్దంగా జరిగిపోతూంది. వీళ్లను గమనించినవారే లేరు. పోయి పోయి, వీధి చివర మరొక సందులో ప్రవేశించారు. ఆ మూల మేడ మీది గది తాళం తీసింది స్త్రీ. అదొక చిన్నసైజు గుహ. ఒక్కటే మంచం ఉన్నది. మంచం క్రింద కుండలు, చట్లు ఉన్నాయి. గూట్లో నూనె సీసా, దువ్వెన, అద్దం వగైరా లున్నాయి. గోడనిండా తమలపాకుల ఉమ్మిచార లున్నాయి.

"నెలకు పదకొండు రూపాయల అద్దె యివ్వాలండీ దీనికి. తిన్నా, తినకపోయినా తప్పదు. ఒక్కరోజు ఆలస్యమయితే మార్వాడీ వొప్పుకోడు. ఊళ్లో—మాబోటోళ్లకు యిల్లివ్వరు" అన్నదావిడ.

"ఎంత ఘోరంగా బ్రతుకుతున్నావు?" అన్నాడతను భారంగా.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. బైట ఏదో అడుగుల చప్పుడు, వాకిలిదాకా వొచ్చి ఆగింది. అతను చెవులు రిక్కించాడు. తలుపు తట్టిన చప్పుడు, ఆ వెంటనే "కాళీ ఉందా?" అన్న ప్రశ్న.

"లేదు" అన్నదావిడ కిటికీ దగ్గరకొచ్చి.

"ఏమిటది?" అన్నాడతను ఇదేమిటో తెలియక.

"పోనీండి...ఇంక నా నోటిమీదుగా ఏమి చెప్పిస్తారు? పాత అలవాటు ప్రకారం వచ్చాడు" అన్నదావిడ సిగ్గుపడుతూ. "ఇంతకు సిద్ధపడ్డా పొట్ట గడవదండీ! ఇవ్వాళ పస్తు పడుకున్నాను."

అతని ముఖం వికారంగా మారిపోయింది. హతాశుడు లాగా దిగజారిపోయ్యాడు. చిరుచెమట పోసింది. పావునిమిషం ఆలోచించాడు. తర్వాత ఛరాలున లేచాడు.

లేచి—

"ఉండు...ఇప్పుడే వస్తాను..." అని చెప్పులు తొడుగుకోబోయాడు.

"ఎక్కడకండీ?"

"నీ కేమన్నా తినేందుకు తెస్తాను. నన్ను వెళ్ళనివ్వు...నువ్వలా తిండి లేకుండా ఉంటే నన్ను చూస్తూ ఊరుకోమంటావా? ఇప్పుడు...పావుగంటలోగా వొచ్చేస్తాను. నా దగ్గిర డబ్బు ఉన్నది."

"ఈ అర్థరాత్రప్పుడు ఎక్కడా కొట్లుండవు. అయినా ఇట్లా పస్తులుండటం నా కలవాటైంది. డబ్బులేక కాదు నేను పస్తున్నది. నా దగ్గిరా ఉంది డబ్బు" అన్నదామె గూట్లో ఉన్న డిబ్బీమూత ఊడదీస్తూ "ఇవిగో! చూడండి. ఇందులో పది రూపాయలున్నాయి.

"అయితే మరెందుకు అన్నం తినలేదూ?"

"రేపే అద్దె యివ్వాలి. ఇవ్వకపోతే ఇల్లు వదిలిపెట్టాలి. పదకొండు రూపాయలకుగాను, పదిరూపాయలు పోగుచేశాను. ఇంకా ఇందులో తిండి

కోసం ఖర్చుపెడితే రేపెట్లా ఇవ్వను అద్దె?" అన్నదామె తిరిగి డబ్బీని గూట్లోకి గిరవాటేసి.

"ఎటువంటి కష్టాలనుభవిస్తున్నావు నువ్వు" అన్నాడతను తాపీగా మంచంమీద నడుంవాల్చి. "రేపటితో నీ బాధలన్నీ విచ్చిపోతాయి. ఈ మురికి గదిలో, ఈ పరిస్థితులమధ్య ఉండటానికి ఇదే ఆఖరు రాత్రి. రేపీ వేళకు—హాయిగా—మా సంఘం గదిలో ఉంటావు. తరవాత—ఎవర్నైనా ఒక మంచివాణ్ణి చూసి పెళ్ళి చేస్తాము. నీ జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది."

నేనిక పెళ్ళి చేసుకోనండీ! పెళ్ళంటేనే నాకు డోకు పుడుతోంది. నేనిలాగే—ఏదో కష్టంచేసుకొని బతుకుతాను" అన్నదామె బెడ్‌లైటు అద్దం మీద వాలుతున్న పురుగుల్ని చూస్తూ.

"ఏమో ?" అన్నాడతను, మంచంనుండి వొంటిచేతిమీద లేచి, వారగా కూచుని.

"ఒద్దులెండి. ఒకసారి చేసుకొని ఏ మనుభవించాను గనక రెండవసారి చేసుకోమంటారు?"

"పోనీ...చాలా మంచివాడు...మాటవరసకు...నేను చేసుకొంటా ననుకో! నన్నుగూడా కాదంటావా?" అన్నాడతను ఆమెవైపు పరీక్షగా చూస్తూ.

ఆమెగూడా అతనివైపు—క్షణకాలం రిచ్చపడి చూసింది.

"మీబోటి గొప్పవారికి నేను తగినదాన్ని కాదండి! మీ పాదాల మమ్ముమాత్రమైనా చేయను. నన్ను మీరట్లా అనబోకండి" అని ఆమె వంగి అతని పాదాలు పట్టుకోనబోయింది. అతనామె భుజాలు పట్టుకొని లేవదీశాడు.

"అట్లా అనకు. నీవంటి అనాథలను ఉద్ధరించటంలోనే పుణ్యమున్నది. భగవంతుడు గూడా ఆశీర్వదిస్తాడు. నీకేమీ అభ్యంతరం లేకపోతే—మా సంఘానికి వెళ్ళంగానే—మనం పెండ్లిచేసు కొందాము. మంచిని గౌరవించు టలో అబ్బురంలేదు. చెడ్డను మంచిస్థితికి తేవటమే గొప్పపని. ఏమంటావు? నీ కిష్టమేగదూ?" అతనామె చుబుకాన్ని పుణుకుతూ అడిగాడు.

ఆమె క్షణకాలమతని ముఖంలోకి చూసి తలదించుకొన్నది. అతనామెను దగ్గరగా తీసుకొని ముద్దుపెట్టుకున్నాడు.........

అరాత్రి ఆమెకు సరిగ్గా నిద్రపట్టలేదు. తియ్యని ఆలోచనలలో తేలిపోయింది. ఇదంతా నిజమా? స్వప్నమా? అనే సందేహంతో గిజగిజలాడింది. స్వప్నమేమోనని, తిరిగి మెలకువ రాగానే, ఈ మధురస్వప్నం చెదిరిపోతుందని విచారించింది. తగ్గించిన దీపాన్ని హెచ్చించి అతన్ని చూచింది. తన ప్రక్కనే అతను నిశ్చింతగా నిద్రపోతున్నాడు. అతని పచ్చని ముఖం నిండా చిరుచెమటపోసింది. దీపపు వెలుగుకు చెమటబిందువులు మిలమిల మంటున్నాయి. జుట్టురేగి, కొద్దిగా, కుడికంటిమీద పడ్డది. చొక్కా గుండీలు ఊడాయి. ఎదురొమ్ము విశాలంగా, ఎగసిపడుతున్నది. అతనిమీద అనంతమైన "ప్రేమ" కలిగిందామెకు. ఇతడు మానవమాత్రుడు కాడనుకొన్నది, అగాధంలోనుండి తనను పైకితీసి, స్వర్గానికి పంపనున్న నవజీవన ప్రదాత అనుకొన్నది ... ఇంతకంటే - ఎప్పుడైతేమటుకు — కోరవలసినదేముంటుంది?

చొక్కా గుండీలు సర్దింది. జుట్టు మెల్లగా పైకి నెట్టింది. దీపాన్ని అతని ముఖందాపుకు తెచ్చి, తదేకంగా చూసింది. ఆమెకు దుఃఖం పొర్లుకొచ్చింది. తన ఏడుపుకు అతను లేస్తాడేమోనని బలవంతాన ఏడుపు దిగమింగుకొని దీపాన్ని తగ్గించింది. అతనికి వో త్తిడి తగలకుండా, మెత్తగా ముద్దు పెట్టుకొంది. అతని ప్రక్కనే ఒదిగి కళ్లుమూసింది. కానీ ఆమెకు నిద్ర రాలేదు. ఆమె ఆత్మసాగరం ఆనందంలో తేలియాడసాగింది. దివ్యదధితులతో పెంపెసలారే సుందర భవిష్యత్తు, సహస్రసహస్తాలతో తన నాహ్వానిస్తున్నట్లు భావించింది. రేపటినుండీ ఆమెబాటలో ముళ్ళడొంకలు, చీకటిపొదలు ఉండవు. రేపటినుండి ఆమె జీవితంలో 'చేదు' ఉండదు. దుర్గంధ భూయిష్ఠమైన, నికృష్టఘోర జీవితానికే రాత్రి భరతవాక్యం. నవనవోన్మేషమైన మధుర జీవితానికీ రాత్రి నాంది ప్రస్తావన, తన్ను తనలాంటి వేలాది నిర్భాగ్యులను ఉద్ధరించటానికి భగవంతుడే ఇట్లా వొచ్చిఉంటాడు. తను అతన్ని చేసుకొంటుంది. చేసుకొని_తనలాగా నీచాతినీచంగా జీవిస్తున్నవారినీ ఉద్ధరించుతుంది...

ఆ రాత్రి ఆమెకు సరిగ్గా నిద్రపట్టలేదు జడివానలా ముసురుకొనే ఆలోచనాధాటికామె ఉక్కిరిబిక్కిరయింది. ఎప్పటికోగాని_కాసింత కునుకు పట్టలేదు. తీరా లేచిచూచేసరికి భళ్లున తెల్లవారింది. తియ్యని కలలబరువుతో

వాలిన రెప్పలను మెల్లగా విచ్చి తన నవజీవన ప్రదాతను చూసింది. కానీ ప్రక్కమీద లేడు. కళ్ళునులుముకొని, చివాలున లేచింది. గది నాలుగు మూలలూ చూసింది. కనిపించలేదు. బహుశః కాఫీకి వెళ్ళిఉండొచ్చు. రాత్రి-తనేమీ తినలేదు గనుక, ఏదైనా తీసుకొచ్చేందుకు వెళ్ళాడేమో? ఇదమిద్ధమని తనేమీ నిర్ణయించలేక పోతున్నది. మరికొంచెం సేపటికల్లా అతనొస్తాడు. అప్పటికేదన్నా పలహారంచేసి సిద్ధంగా ఉండాలి. అందుకోసం ఆమె గూటిదగ్గర కెళ్ళింది. రాత్రి-తను పదిరూపాయలు దాచిన డబ్బా మాత్రం, ఖాళీగా-ఆమెనేపు బావురుమని చూసింది.

"భగవంతుడా!" అన్నదామె నిలువునా కూలబడి.

అప్పటికి భగవంతుడింకా నిద్రలేవలేదు.